


నీలాచలం నల్లనివాడు కాదు. అతని భార్య చామంతి నల్లగా వుంటుంది. అతను కొండలా భారీ మనిషి కాదు. ఆమె మాత్రం గున్నఏనుగులా వుంటుంది. ఆయన కళ్లు లోతు. ఆవిడ పళ్లు యెత్తు. అతని సూదైన ముక్కుకు నీలైన కళ్లద్దాలెప్పుడూ అంటుకునే వుంటాయి. అనుకోకుండా కోరుకోకుండా అదృష్టం వెతుక్కొని వచ్చి అతని యెదుట వాలిందంటారు. అతని అదృష్టం యేమిటని యెవరైనా ప్రశ్నిస్తే?

అతగాని తండ్రి అరించి పోయాడు. అతగాడి చదువు పూర్తికాగానే ఉద్యోగం వచ్చింది. అలాంటి యిలాంటి లాకాయి లూకాయి వుద్యోగం కాదు. రైల్వే వుద్యోగం. ఇప్పుడు 'అడక్కుండా యిచ్చేవాళ్లు తనవెంట తిరుగుతున్నారు. పీసమంత పనిచెయ్యక్కర్లేకండా పుచ్చుకో గలుగుతున్నాడు. పుచ్చుకున్న దానికి పన్ను చెల్లించక్కర్లేని పని. అతని ఆరోగ్యం ప్రభావమో డబ్బు ప్రభావమో అతనేనాడూ శలవు తీసుకున్న పాపాన పోలేదు. అడక్కుండానే అల్లునికి అన్ని హంగులు ఆస్తులు గుమ్మరించిన మామ గారిని పొందాడు.

ఇంతమంది అదృష్టవంతుడనుకున్న



-బలివాడ కాంతారావు

వాడిని దురదృష్టం వంతుడని అనడానికి యెవరికైనా దమ్ములున్నాయా? పెద్ద వాళ్లెవరూ అనలేదు. మధ్య తరగతి వాళ్లసలే అనలేరు. అన్నది ఒక అడుక్కున్నది. అదృష్టానికి యేకోశానా నోచుకోలేని ఒక అభాగ్యురాలు.

ఆ స్టేషను బిల్డింగు కొత్తగా కట్టారు. కట్టిన కొత్తలోనే చుట్టూ చెత్తా చెదారం చేరింది. తుడిపించినా చెత్త చేరుతునే వుంది. చక్కదనాన్ని సహించలేని ప్రజమెసలితే యింకెలా వుంటుందని విసిగెత్తిన నీలాచలంకు ఒకనాడు:

వాన బాగా కురిసి వెలసిన రాత్రి ఒక అభాగ్యురాలు తారసపడింది.

ఎక్కడ? పెయిటింగ్ రూములో కాదు. సిమ్మెంటు ప్లాటుఫారం మీద కాదు. పోర్టికోలోనూ కాదు. స్టేషను మాష్టారు గదిలో అంతకన్నా కాదు. పూలమొక్కలతో సింగారించుకోడానికి స్టేషనుకు అనుకుని ముందుగా కట్టిన సిమెంటు దిమ్మలక్రింద తలదాచుకుంటోంది. ఇలా తల దాచుకోడానికి వచ్చిన వాళ్లిదివర కెందరో నానా కంగారుచేసి అజాగాని ఒక పాయిఖానాచేసేసారు. వాళ్లని తగిలేసాక యింకెవరి ముఖం యిక్కడ కనిపించ కూడదని భీష్మించుకున్న నీలాచలంకు,యీ రాత్రి యీ అడుకున్నది యెదురైంది. మగదిక్కులేదు. ఈ దిక్కుమాలినది యిక్కడ ఒళ్లు అమ్ముకునే దుకాణం పెట్టింది. కామక్రీడలు రైళ్ల రాకపోకలు చూసినట్లే చూడాలి. ఇది యిక్కడ స్థావరం యేర్పరచుకుని బలాన్ని సంపాదించుకోకుండానే తగిలేయాలి.

ఈ ఆలోచనలు నీలాచలంకు చీకటిలో రాలేదు. మెర్క్యురీలైట్ల కాంతిలోనే వచ్చాయ్. ఇది వరకు వాళ్ళు పొమ్మంటే లోపల గొణుక్కుని పోయారు గానీ బయటకు అనే ధైర్య సాహసాలు లేనివాళ్ళు. అదే ప్రయోగం యీమెపై చేస్తే యీమె కదల్లేదు. జవాబు గంట మ్రోగినట్లు చెప్పింది. ఆ మాటలు స్టేషనులో వున్న వాళ్ళందరికీ వినిపించినట్లు చెప్పింది. ఇతని గురించి క్షుణ్ణంగా తెలిసిన మనిషిలా యెలుగెత్తి చాటింది.

"నీకున్నదేటి నాకులేనిదేటి బాబూ? తలదాచుకోడాని కొస్తే తగిలేస్తన్నావ్? నీ యింటికాడ సోతమ్మన్నానా? యీ టేషను నివ్వు కట్టించేసనావా?"

అతను కాదు కాదంటే ఇంకా యేవేవో అని నేను కదలనని భీష్మించుకున్నట్లు ఆ అడుక్కున్న ముండ కూర్చుంటే తొలిసారి నీలాచలం మనసు చివుక్కుమంది. తన హోదా యీనాటికి గంగలో కలిసిపోయిన మాట అటుంచి, ఆమె అన్న తొలి ప్రశ్న బాణంలా గుచ్చి గుండెలో పొడుస్తోంది. ఎంత కోపంవచ్చినా యేమీ చెయ్యలేక పొయ్యాడు. ఆ రాత్రి ఒకమూల, గదిలో మంచం మీద పడుకున్నా ఆ అడుక్కున్న ముండ తన తల రోకటికలోపెట్టి దంచుతున్నట్లు అనిపిస్తోంది.

తలపోటు మధ్యలో మెదడలో ఒక మారుమూల శ్మశానంలో మొలచిన పచ్చగడ్డిలా, కాలిన రవికె అంచు ఝురీలా అందాలను విరజిల్లే ఆమె స్వరూపంలో ఒక భాగం మెదలి ఆశను జారిపోకుండా పట్టుకుంటోంది. తర్జన భర్జనలు పడి ఒక నిర్ణయం తీసుకుని ఉదయమే స్టేషనుకు వెళ్లాడు,

అతని నిర్ణయాన్ని తొలిసారి మార్చుకో వలసివచ్చింది. కారణం? తన యింట్లో పెట్టెలో నగలున్నా పెట్టుకునే చేతులులేవు, చీరలున్నా కట్టుకునే సాహసంలేదు. ఈమె నకిలీ సరుకులు పెద్దాపురం దుద్దుల జతలా పెట్టుకుని, చౌకచీరనే నీటుగా వుప్పాడ ఝురీ చీరలా కుచ్చులుపెట్టి మరీ కట్టుకుంది. కునుకు తీసి లేచి కూనిరాగాలతో చుట్టూ శుభ్రం చేసి నెత్తిపెనున్న సిమ్మెంటు గోలాలలో అడవి మొక్కలను నాటుతోంది.

స్టేషను బోడి గోడల్లో నీలాచలంకు యిన్నాళ్లూ నాణేల ఖనఖనలే వినిపించాయ్. ఇప్పుడు పచ్చదనం దిద్దినట్లు కనిపిస్తోంది. కొన్నాళ్లకు నాటిన మొక్కలు పచ్చగా పెరిగి, కొన్ని

పూలసౌరభంతో వికసించడానికి మొగలు తొడిగాయి కవ్వించినట్లు చూసే యీ ఆడది కండలపుష్టి పుంజుకొని నీలాచలంకే తప్పటడుగులు వెయ్యించేస్తోంది. అడుగులు పడటానికి ఆవిరైపోతున్న మనోనిబ్బరాన్ని చల్లార్చి మళ్ళీ నీరులా మార్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

అందుకే కామోసు .... స్టేషనులో ఉద్యోగస్థులతో చెప్పకుండా, తను మంచివాళ్ళనుకునే వ్యాపారస్తులతో ఈమె బతుకును బాహాటంచేసిచెప్తుంటే

ఒకతను : చూడకుండా చెయ్యకుండా గాలి కబుర్లు నమ్మనన్నాడు.

ఇంకొకడు : ఆడది నిల్చోడానికి అంద మొక్కటేలేదు. పిక్కబలం వుంది. అన్నాడు.

వేరొకడు : ఆడదాని మనసు తేనెలాంటిది. అర్రులు చాచేవాళ్ళం దరికీ దక్కదు.

వీళ్లలా తన వుద్దేశాన్ని యెదుర్కొంటున్నారంటే యివి వీళ్ళ అనుభవసారమా? లేక ఆ చూపులే వీళ్ళకు గిలిగింతలు పెట్టగా, అలవరచుకున్న సానుభూతా? ఈ మధ్య తను లంచం రేటు పెంచాడు. రేటు పెంచానన్న అక్కసుతో తను 'అవునన్నది కాదంటున్నారా? తను మంచి యిరకాటంలో పడ్డాడు.

ఈ దిక్కుమాలినది శృంగారపు పూలబాణాలను విసురుతుంటే ఆ మన్మథ బాధను పెళ్లాంపై రుద్దబోతే ఆవిడ తక్కువ చదివిందా? ఆమె దగ్గరా శృంగారం వుంది.

అ శృంగారపు కత్తులకు రెండు వైపులా పదునుంది.

ఈ మగాడ్నికట్టుకుని ఒక బిడ్డని పొందలేకపోయానన్న అక్కసు అతగాడంటే హీనంగా చూసే మనస్తత్వాన్ని అలవరచుకోనిచ్చింది. ఈ మత్తులను నీలాచలం బోడిచేతులతో అడ్డుకోలేడు. అందుకే ఆమె కోరికలు పెరుగుతున్నాయ్ - బంగారం ధర పెరిగిపోతుంది. లంచాలు పెంచినా ఆమె కోరికల బరువుకు సరితూగలేదు.

ఒకనాటి రాత్రి - నీలాచలం మనసు కోరికలతో నిండుకున్న రాత్రి. నరాలన్ని ఎక్కుపెట్టిన బాణంలావున్న సమయంలో పడకగదిలో పూలవాసనలు కాంక్షించిన క్షణాలో - చేయిస్తానన్న వజ్రపు దుద్దులు తేలేదని దెయ్యంలా పెళ్ళాం జుత్తువిరబోసుకుని భయపెట్టింది. ఈ దెయ్యం కోరికతీర్చడానికి యింకెందరి పీకలుకోస్తానని విసుక్కున్నాడు. దెయ్యం పిశాచంగా మారి అమాంతంగా మీదపడిపోతే వీధిలోనికి పరుగెత్తాడు.

తనదగ్గరనున్న బాణం విసరినా ఆమెకు తగలదు. ఈ పూల బాణం అందుకునే రతీదేవి కాదీమె. ఇప్పుడే


*With the best Compliments from :*

**Jamuna Agencies** PHARMACEUTICAL DISTRIBUTORS

*26/22/3B, Mudunurivari Street, Gandhi Nagar, VIJAYAWADA-3.*

Phone : 74682

**THE LOTUS TYPEWRITER & GENERAL AGENCIES**

***Peddibhotlavari St : Governorpet : VIJAYAWADA-520 002.***

*Branches at* : [1] 4-3-349, Bank St., HYDERABAD-500 002. (Phone : 44817)

[2] 25.8-160, Main Road, VISAKHAPATNAM-530001 (Phone : 4012)


**Government Approved Typewriter Mechaincs**

నీలాచలం మేల్కొన్నాననుకున్నాడు. దాహంతో దరిద్రం వదల్లేదు.. ఈ క్షణాన రోడ్డుమీదపడ్డ దరిద్రుడు తను ఎక్కడో పడ్డవర్షం యిక్కడ చలిని సృష్టించింది. మేఘాలు నిండిన ఆకాశంలో అప్పుడప్పుడు వురుములూ మెరుపులూ! తనకంటే ఆ అడుక్కున్నది అదృష్టవంతురాలు. తన పెళ్లానికిలేని కనికరం దానికి వుంది. తన వలన సుఖపడి భయంకరంగా చూసిన పెళ్లాం కన్నా, తనవలన బాధతో తనని ఆహ్వానించే చూపులను విసరింది. ఇది అడుక్కున్న ముండ అంటే అవుననట్లు వూరుకుంటోంది. చూపులు విసరి గుండెను దగ్గరకు లాక్కుంటున్నావు, అంటే ఒప్పుకుంటుంది. దీని మనసుకు బురఖాలేదు. తన పెళ్లాం గయ్యాళి. గయ్యాళి అని లోకంఅంతటికి తెలుసు. ఇలా గయ్యాలి అయ్యిందీ అంటే తన ఏక పత్నీవ్రతం చూసేకదా; తన చాతకాని తనంతో తనను లోకువ చేసింది కదా!

ఈ పిశాచికి బుద్ధిచెప్పాలి. దీని' కన్నా పసందైనది తన దృష్టిలో వున్నద'ని దానికి తెలియాలి. ఇక సీతీ అవినీతీ లంచం తండితో యీ నీలాచలం పెరుగుతున్నాడు. అలంకరించుకున్న వేశ్యలావుంది తన యాజమాన్యంలో వున్న రైల్వేస్టేషను.

నడుస్తుంగానే గాలీ వర్షం ముంచుకొచ్చింది. కరెంట్ పోయింది. చీకటి. చీకట్లో చెట్లు రోధిస్తున్నాయ్. తన మనసు మండిపోతోంది. ఇలాంటి సమయంలో అంత యిల్లుండగా ఆ యింటికి పోలేడు. అలాంటి పందిర మంచం. పట్టుపరుపులుండగా దానిపై పడుకోలేడు. కళ్లు మూసుకునైనా కోరికల భీభత్సాన్ని తగ్గించలేడు.

మూడులోకల్లో జరగని అన్యాయం తనకు జరిగిపోయిందని, యీ అన్యాయానికి మూలకారకురాలు తన భార్య నరరూప రాక్షసి। తనచే అన్ని అన్యా




యాలు చేయించింది. ఆలాంటి చామంతికి తన మ సం గురించి తెలియాలి।

ఇదివరకు మెర్క్యురీ లైట్ల వెలుగులో చూసి యీ అడుక్కున్న ఆడదాన్ని అసహ్యించుకున్నాడు. ఇప్పుడు ఆలైట్లు ఆరినప్పుడు ఆమె అప్సరసలా కనిపించింది. చుట్టూ యెవరూలేరు, ఈ వర్షంలో యెవరూ స్టేషనుకు వచ్చి పడిపోరు. ఈ రాత్రప్పుడు వచ్చే రైలు బండేదీలేదు. ఇన్నాళ్లూ తెలిసి మరీ తెలియనట్లు చాలా విషయాల్లో సంచరించాడు ఈ క్షణం తెలిసి మరి తెలిసినట్లు సంచరించబోతున్నాడు. ఈమె. ఎవర్తో - పేరు తెలియదు. చీకటిలో రూపు తెలియని ప్రకృతి వెన్నెల్లో వనకన్యలా ప్రక్కకే వచ్చినట్లు కూర్చుంది. మెల్లగా ఆ సిమెంటు చిమ్మల ప్రక్కకు చేరాడు. సంకయిస్తూ ఆ చివరికే వుంటే ఆమె అన్నది-

"తడిసి పోతున్నావ్-యిటుజరుగు"

మెల్లగా జరుగుతూ దగ్గరయ్యాడు. ఆవిడ చీర కప్పుకుని అలాగే కూర్చుంది. పిలుస్తుందంటే పిలవలేదు. చలివేస్తుందన్నట్లు కొస్త వణికాడు.

"వణికి పోతున్నావు. ఇంద కప్పుకో.." అని తనుకప్పుకున్న చీర న మీద పడేసింది. ఇద్దరం కప్పుకుందామా' అనబోయి తనగొంతుక యెక్కడ పోల్చేస్తుందో అని వూరుకున్నాడు. అటువేపు కొడ్తున్న వర్షం యిటువైపు తిరిగింది. వెలిపిరి కొట్టుంటే ఆమె కొద్దిగా తనవేపు జరిగింది. ఒళ్లంతా కళ్లుచేసుకున్నాడు. ఆ చీకటిలో అతని కళ్లు పిల్లికళ్లయిపోయాయి. ఏకాంతంలో పిల్లికి కనిపించిన పాలగిన్నెలా వుంది ఆమె. ఒక్కసారి వుక్కిరిబిక్కిరైపోయి- ఆమెమీద పడిపోయాడు. అమె విదలించుకుని కేకలువేస్తే చప్పున స్టేషనువేపు కదలిపోతూ యేమీ తోచక నీలాచలం యెటో పారిపోదామని చూస్తే స్టేషను లోపలినించి లైట్లు పట్టుకుని ఇద్దరు వచ్చేస్తుంటే నీలాచలంకు యేమీతోచక కేకలు వేసాడు. ఉన్నవాళ్లంతా చుట్టూ మూగారు.

ఆవిడతిట్టోంది. నీలాచలం "ముండ। నీపనిపట్టాసుండు" అంటున్నాడు. వాళ్లంతా యేమైందని అంటే నీలాచలంకు అనడానికి అవకాశం యివ్వకండా ఆ అడుక్కున్న ఆడది.

"వణికిపోతన్నా డెవరో అని నాచీర

కూడా కప్పుకోడానికిచ్చాను బాబో – ఒళ్ళు యేడెక్కిందేమో మీద పడిపో వాడీ గడండు.

"ఎవరనుకుంటున్నావ్ ?" అన్నా

డొకడు.

"ఎవడైతేటీ? యిద్దరం మనుష

లమే –"

"అడుకున్నదేటి? నాకు లేనీదేటి ?"

"మీరందరూ ఆ ముండ మాటలు నమ్మరని తెలుసు. దీపాలు పోయాయని స్టేషను చూద్దామని వస్తే పిశాచంలా పట్టుకుందండీ.... ?"

"ఊసినుకొచ్చినాడట ఊసినికి గొడుగేసుకోకుండా పారొచ్చినాడు" వచ్చినవాళ్లు అతని మర్యాదను కాపాడ్డానికి

"పో ముండా...., పో...." అని నీలాచలంను స్టేషను లోపలికి తీసుక పోయారు.

మరునటిరోజు ఆ అడుక్కున్నది కదలకుండా గొడలచేస్తే రైల్వే పోలీసువచ్చి ముందురాత్రి నీలాచలం గారికి యేచిరె తే ఆదుకుందో ఆ చింకి చీరను మరికాస్త చింపి మరీ, బయటకు విసిరేసారు. ఆడుకోడానికి దాహంవేస్తే నీరు తాగడానికీ, స్నానంచేస్తే నీరు పోసుకోడానికీ యే డబ్బాదొక్కు వాడేదో ఆ డొక్కును అంతదూరం పెంటకుప్ప మీదకు విసిరేసారు. చివరకు 'అన్యాయం' అని అరస్తున్న నోటిని మూసి నీతిగా బతకడానికి కదలుతున్న ఆచేతున్ని కట్టేసి అంత దూరం తోశేసారు.

ఈ పేదరాలి కోసం చల్లారి రెండు కన్నీటి బొట్లయి రాలాయి. నేరం చెయ్యని వరాలన్నీ పొంగి, ఆమెను పైకెత్తించి, వడిపించాయి. ఇన్నాళ్లూ శ్రమపడి పెంచిన పూలచెట్ల పరిమళాలకు దూరమౌతున్న ఆమెలోనున్న యెగులేని పరిమళంతో బతకడానికి యెన్నెన్నో చోట్లున్నాయన్నట్లు ఆ వూరు వదలి పోయింది.

కొన్నాళ్లకు ఆమె నాటిన మొక్కలు మాయమైపోయాయి. క్రింద చెత్త చెదారం చేరింది. లంచంనాణాలు. ఖణేల్– ఖణేల్' మంటున్నాయి. స్టేషను గోడలు మెర్క్యురీ దీపం వెలుగులో కూడా బోడిగోడల్లావే కనిపిస్తున్నాయ్. ❋


సంక్రాంతి శుభాకాంక్షలు

ఫోను : **4394**

"ఒలింపిక్" (బొంబాయి) స్టీలు ఫర్నిచర్, 'M.M' ఫోమ్

'O' ఫోమ్-'ఉషా' "ఓరియంట్" పంకాలు

సోఫా-కం-బెడ్స్-బ్రిటిష్ పెయింట్స్

మెయిన్‌డీలర్సు.



# M/S లక్ష్మి ఏజన్సీస్

రాజారామమోహన్‌రాయరోడ్

కాకినాడ